


కంట్రోల్‌రూంలో పరిస్థితి సమీక్షిస్తున్న రెవెన్యూశాఖ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్





శ్రీనివాసపురం వద్ద అల్లకల్లోలంగా సముద్రం

పట్టినబాక్కం తీరానికి దూరంగా నిలిపిన మరపడవలు



నేడు తీరం దాటనున్న ఫెంగల్

- 15 జిల్లాలకు భారీ వర్ష సూచన
- వాతావరణ శాఖ హెచ్చరిక
- చెన్నై సహా ఆరు జిల్లాల్లో విద్యాలయాలకు సెలవు
- అల్లకల్లోలంగానే సముద్రం

అడయార్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైవున్న వాయుగుండం శుక్రవారం తుఫానుగా మారింది. ఇది శనివారం ఉదయం పుదుచ్చేరి (కారైక్కాల్) - మహాబలిపురం మధ్య తీరం దాటవచ్చని భారత వాతావరణ శాఖ చెన్నై ప్రాంతీయ కేంద్రం అంచనా వేసింది. ఈ తుఫాను తీరం దాటే సమయంలో గంటకు 65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయవచ్చని హెచ్చరించింది. ప్రస్తుతం ఫెంగల్ తుఫాను చెన్నై నగరానికి సుమారుగా 250 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. అలాగే, చెన్నై, చెంగల్పట్టు, తిరువళ్ళూరు, కాంచీపురం, కడలూరు జిల్లాల సహా మొత్తం 15 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.. దీంతో చెన్నై, చెంగల్పట్టు, తిరువళ్ళూరు, కాంచీపురం, కడలూరు, మైలాడుదురై జిల్లాల్లో పాఠశాలలు, కాలేజీలకు సెలవు ప్రకటించారు. రాష్ట్రంలో చెన్నై, చెంగల్పట్టు, తిరువళ్ళూరు, కాంచీపురం, రాణిపేట, విల్లుపురం, కడలూరు, మైలాడుదురై, నాగపట్టణం, తిరువారూర్, తంజావూరు, పుదుక్కోట, రామనాథపురం, తిరునెల్వేలి, కన్నియాకుమారి జిల్లాలతో పాటు పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. చెన్నై నగరంలో గిండి, ఈక్కాట్టుతాంగల్, కోడంబాక్కం, నుంగంబాక్కం, ఎగ్మోర్, వడపళని, చెప్పాక్కం, తిరునెల్వేలి, మైలాడుదురై, అన్నాసాలై, ప్యారీస్, కాశీమేడు, టి నగర్ తదితర ప్రాంతాల్లో బలమైన గాలులతో వర్షం కురిసింది. అలాగే, కాశీమేడు, పట్టిణంపాక్కం ప్రాంతాల్లో సముద్రం అల్లకల్లోలంగా మారి, అలలు ఉధృతంగా ఎగిసిపడుతున్నాయి. తుఫాను తీరందాటే సమయంలో తమిళనాడులోని కోస్తా జిల్లాలతో పాటు గల్ఫ్ ఆఫ్ మన్నార్, కన్నియాకుమారి సముద్రతీరం ప్రాంతాల్లో గంటకు 55 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరించిన వాతావరణ శాఖ జాలర్లు సముద్రంలో వేటకు వెళ్ళొద్దని, వెళ్ళినవారు తక్షణం తీరానికి చేరుకోవాలని సూచన చేసింది.

ప్రభుత్వ యంత్రాంగం సిద్ధం

ఫెంగల్ తీరం దాటే సమయంలో చెన్నై, తిరువళ్ళూరు, కాంచీపురం, చెంగల్పట్టు, కడలూరు, విల్లుపురం, మైలాడుదురై జిల్లాల్లో గంటకు 60 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. దీంతో ఆయా జిల్లాల్లో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. అలాగే, భవన నిర్మాణ స్థలాల్లో ఉపయోగించే అన్ని క్రేన్లను కిందికి దించాలని ఆదేశించింది. ప్రకటన బోర్డుల్ని కూడా కిందకు దించాలని పేర్కొంది. ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది. మరోవైపు, మహాబలిపురం తీర ప్రాంతంలో పర్యాటకులను పోలీసులు ఖాళీ చేయించారు. తీర ప్రాంతంలో సముద్ర స్నానాలపై పోలీసులు నిషేధం విధించారు. తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాల్లో వరద సహాయక బృందాలను సిద్ధం చేశారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ శుక్రవారం సాయంత్రం కంట్రోల్ రూంలో పరిస్థితి సమీక్షించారు. ఇప్పటికే ఎన్‌డీఆర్ఎఫ్ బలగాలు సిద్ధమైన విషయం తెలిసిందే. ఇదిలా వుండగా శనివారం భారీ వర్షం పడే అవకాశముండడంతో విల్లుపురం, కడలూరు, కళ్లకుర్చి జిల్లాల్లో విద్యాలయాలకు సెలవు ప్రకటించారు. అదే విధంగా పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లోనూ విద్యాలయాలకు సెలవు ఇచ్చారు.

రాష్ట్రపతి తిరువారూర్ పర్యటన రద్దు



పెరంబూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం తిరువారూర్ పర్యటన రద్దయింది. తిరువారూర్‌లో తమిళనాడు కేంద్ర విశ్వవిద్యాలయం 9వ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సివుంది. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా తిరువారూరు నగరం, విశ్వవిద్యాలయ ప్రాంగణాలను పోలీసులు స్వాధీనంలోకి తీసుకున్నారు. బంగాళాఖాతంలో నెలకొన్న ఫెంగల్ తుఫాను శనివారం తీరం దాటనుందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రపతి తిరువారూర్ పర్యటన రద్దయింది. కాగా, నాలుగు రోజుల పర్యటన కోసం గురువారం వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నీలగిరి జిల్లా ఊటీ రాజ్‌భవన్‌లో బసచేశారు. శుక్రవారం ఆమె ఆదివాసీయులు, గిరిజనులతో సమావేశమయ్యారు.

రామానుజర్ ఆదికేశవ పెరుమాళ్ ఆలయంలో లోకేశ్

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఉన్నతవిద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శ్రీపెరంబుదూర్‌లో వున్న రామానుజర్ ఆదికేశవ పెరుమాళ్ ఆలయాన్ని శుక్రవారం సందర్శించారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించాక స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన విమానంలో హైదరాబాద్ బయలుదేరివెళ్లారు. ఆలయంవద్ద లోకేశ్‌కు ఆలయ నిర్వాహకులు, చెన్నై టీడీపీ అధ్యక్షుడు చంద్రశేఖర్, టీడీపీ నేతలు మన్నూరు చలపతి, మన్నెం రవిబాబు, రాజేష్, జనార్ధన్, ఉమాపతి, మోహన్ తదితరులు స్వాగతం పలికారు.



ఆలయంలోకి వెళ్తున్న లోకేశ్

మదురై జిల్లాలో మైనింగ్ తవ్వకాలకు అనుమతి

నిరసనగా 50 గ్రామాల్లో బంద్ ● ఆ తవ్వకాలు ఆపండి ● పీఎంకు స్టాలిన్ లేఖ

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లాలో టంగ్‌స్టన్ మైనింగ్ తవ్వకాలకు అనుమతించడాన్ని నిరశిస్తూ శుక్రవారం 50 గ్రామాల వ్యాపారులు బంద్ పాటించారు. దుకాణాలను మూసి నిరసన ప్రకటించారు. మదురై జిల్లా మేలూరు సమీపంలోని అరిట్టాపట్టి ప్రాచీన చారిత్రక వారసత్వ సంపదలతో నిండిన ప్రాంతం. జైనుల చరిత్రకు సంబంధించిన ప్రాచీన చిహ్నాలు కూడా ఈ ప్రాంతంలోనే ఎక్కువగా ఉన్నాయి. అళగర్‌మలైకి, పెరుమాళ్‌మలైకి మధ్యనున్న ఈ అరిట్టాపట్టి క్రీ.పూ. రెండో శతాబ్దానికి సంబంధించిన తమిళ బ్రహ్మీలిపి శాసనసాలు కూడా ఉన్నాయి. ఇలాంటి చారిత్రక విశేషాలతో కూడిన ఈ ప్రాంతంలో టంగ్‌స్టన్ మైనింగ్ తవ్వకాలు జరిగితే ప్రాచీన చారిత్రక వారసత్వసంపద తుడిచిపెట్టుకుపోతుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అరిట్టాపట్టి, దాని సమీపంలోని మీనాక్షిపురం, కూలానిపట్టి, చెట్టియార్‌పట్టి, ఎ.వల్లభపట్టి, షణ్ముగనాథపురం, నడువలైవు, తెర్కు వలైవు, ఎట్టి మంగళం గ్రామాలతో కూడిన 5 వేల ఎకరాల్లోని ఈ ప్రాంతాన్ని స్టెరిలైట్ కర్మాగారాన్ని నడిపిన వేదాంత గ్రూపునకు చెందిన హిందూస్థాన్ జింక్ సంస్థ వేలం ద్వారా టంగ్‌స్టన్ మైనింగ్ తవ్వకాల హక్కులను పొందినట్లు వార్తలు రాగానే మేలూరు పరిసరాల్లోని 50 గ్రామాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అరిట్టాపట్టిలో ఈ నెల 23న జరిపిన గ్రామసభలో టంగ్‌స్టన్ మైనింగ్ తవ్వకాలకు అనుమతివ్వరాదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తూ ఏకగ్రీవ తీర్మానాన్ని కూడా ప్రతిపాదించి ఆమోదించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుండి మేలూరు బస్‌స్టేషన్, చెక్కడి బజార్, పెరియకడై వీధి, బ్యాంక్ రోడ్డు, అళగర్ కోవిల్‌రోడ్డు, తిరువాదవూరు రోడ్డు, శివగంగ రోడ్డు ప్రాంతాల్లో ఉన్న సుమారు 1000 దుకాణాలను మూసివేశారు. దీంతో ఆ ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి. ఇదే విధంగా అరిట్టాపట్టి, ఎ.వల్లభపట్టి, మీనాక్షిపురం, నాయక్కర్‌పట్టి సహా 50 గ్రామాల్లోనూ వ్యాపారులు బంద్ పాటించి దుకాణాలను మూసివేశారు. మేలూరులో పలు సంఘాల ఆధ్వర్యంలో బెన్నీక్విక్ బస్‌స్టేషన్ జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు. సుమారు రెండు వేలమంది ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

తవ్వకాలు ఆపించండి



మదురై జిల్లాలో టంగ్‌స్టన్ మైనింగ్ తవ్వకాలకు సంబంధించి హిందూస్థాన్ జింక్ సంస్థకు ఇచ్చిన అనుమతిని తక్షణమే రద్దు చేయాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీకి ఓ లేఖ రాశారు. ఆ లేఖలో మదురై జిల్లాలో టంగ్‌స్టన్ మైనింగ్ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం హిందూస్థాన్ జింక్ సంస్థకు అనుమతులివ్వడంతో ప్రస్తుతం ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రధాని మోదీ తక్షణమే జోక్యం చేసుకుని టంగ్‌స్టన్ మైనింగ్‌కు ఇచ్చిన అనుమతి రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఖనిజ సంబంధిత మైనింగ్ హక్కులను కేంద్ర ప్రభుత్వం వేలం పాట నిర్వహించడం వల్ల కలిగే నష్టాలను గురించి ఆందోళన వ్యక్తం చేస్తూ గతేడాది అక్టోబర్ 3న రాష్ట్ర నీటి వనరుల శాఖమంత్రి కేంద్రప్రభుత్వానికి లేఖ కూడా రాసినట్లు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో గత ఈ నెల 7న టంగ్‌స్టన్ ఖనిజ సంపద మెండుగా ఉన్న నాయక్కర్‌పట్టిలో మైనింగ్ ఏర్పాటు చేయడానికి హిందూస్థాన్ జింక్ సంస్థను ఎంపిక చేసినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం శోచనీయమన్నారు. టంగ్‌స్టన్ లభ్యమయ్యే గ్రామాల్లో గుహాలయాలు, ప్రాచీన శిల్పాలు, జైనుల చిహ్నాలు, పంచపాండవుల రాతి గుహలు వంటి పురావస్తు పరిశోధక శాఖకు చెందిన చారిత్రక చిహ్నాలున్నాయని, ఆ ప్రాంతంలో గనుక తవ్వకాలు జరిపితే ఈ చారిత్రక వారసత్వ సంపదలన్నీ మట్టికొట్టుకుపోతాయని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులలో టంగ్‌స్టన్ మైనింగ్ తవ్వకాలకు అనుమతి ఇవ్వడం గర్హనీయమని తెలిపారు. అంతే కాకుండా ఆ మైనింగ్ తవ్వకాలకు తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితులలోనూ అనుమతించే ప్రసక్తే లేదని, వెంటనే అనుమతులు రద్దు చేయాలని ఆ లేఖలో స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండా కేంద్ర ప్రభుత్వం గనులకు సంబంధించి ఎలాంటి వేలంపాట జరుపకూడదని కూడా ఆయన పేర్కొన్నారు.



మేలూరులో మూతబడిన దుకాణాలు

పుదుకోటలో బీజేపీ, అన్నాడీఎంకే నేతల ఇళ్లలో ఈడీ తనిఖీలు

ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పుదుకోటలోని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి మిత్రులైన రవిచంద్రన్, ఆయన సోదరుడు పళనివేల్, వారి బంధువు బీజేపీ జిల్లా కోశాధికారి మురుగానందం నివాసాల్లో శుక్రవారం ఉదయం ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ ముగ్గురు గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా సోలార్ వీధి దీపాల ఏర్పాటుకు ప్రజాపనుల శాఖతో కాంట్రాక్ట్ కుదుర్చుకున్నారు. ఈ నేపథ్యంలో 2021లో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 2022వ సంవత్సరంలో రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ పోలీసులు పుదుకోట సమీపంలో కరంబకుడి ప్రాంతంలో ఉన్న మురుగానందం, రవిచంద్రన్, పళనివేల్ ఇళ్లలో సోదాలు నిర్వహించి పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఈ ముగ్గురిపై కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో, సోలార్ వీధి దీపాల ఏర్పాటులో మనీల్యాండరింగ్ జరిగినట్లు ఆరోపణలు రావడంతో ఈడీ అధికారులు ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఏసీబీ నుంచి సేకరించారు. ఆ వివరాల ఆధారంగా మాజీ మంత్రి మిత్రుల ఇళ్లలో మూడవసారి పోలీసు భద్రత మధ్య ఆరుగురితో కూడిన ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టిన వ్యవహారం కలకలం రేపింది.



తనిఖీల సమయంలో పోలీసు భద్రత

తిరుప్పూర్‌లో ఘాతుకం

● ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి హత్య

ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా పల్లడం సమీపంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దారుణ హత్యకు గురైన సంఘటన కలకలం రేపింది. వివరాలిలా.. సేలమైగౌండన్‌పాళయం గ్రామంలో దైవశిఖామణి-అలమాత్తాళ్ అనే వృద్ధ దంపతులు తమ మామిడి తోటలో నివసిస్తున్నారు. వీరి కుమారుడు సెంథిల్‌కుమార్ ఐటీ ఉద్యోగి. ఆయన తన భార్య, కుమారుడు, కుమార్తెతో కోవైలో నివసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో, గురువారం సెంథిల్‌కుమార్ తమ తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. శుక్రవారం ఉదయం వారింటికి వెళ్లిన క్షురకుడు.. ఆ ముగ్గురూ ఇంట్లో శవాలుగా పడివుండడం చూసి ఇరుగు పొరుగువారి సాయంతో అవినాశి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలికి జాగిలాలు ఫోరెన్సిక్ నిపుణులతో వెళ్లిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక విచారణలో నగలు, నగదు కోసమే గుర్తుతెలియని వ్యక్తులు ఆ ముగ్గురినీ హత్య చేసి ఉంటారని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇదిలా ఉండగా, ఈ హత్యకు సంబంధించి నిందితులను అరెస్ట్ చేసేందుకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు తిరుప్పూర్ పోలీస్ కమిషనర్ లక్ష్మి ప్రకటించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ... ముగ్గురు హత్యకు గురైన ప్రాంతం నుంచి బంగారునగలు దోచుకున్నారని, పదునైన ఆయుధాలతో హత్యకు పాల్పడ్డారని తెలిపారు.





హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్లో) మృతులు (ఫైల్ ఫొటోలు)

నేరాలకు నిలయంగా రాష్ట్రం
ఈపీఎస్ ధ్వజం

డీఎంకే ప్రభుత్వంలో రాష్ట్రం నేరాలకు నిలయంగా మారిందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ధ్వజమెత్తారు. తిరుప్పూర్ సమీపంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దారుణహత్యకు గురికావడం దిగ్భ్రాంతి కలిగించిందని తెలిపారు. మూడేళ్ల డీఎంకే పాలనలో హత్యలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని, నేరస్తులను అరెస్ట్ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఈపీఎస్ ఆరోపించారు.

సమాచార దర్శిని

4న బోన్సాయ్ మొక్కల పెంపకంపై శిక్షణ

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బొన్సాయ్ మొక్కల పెంపకంపై శిక్షణ ఇవ్వనున్నారు. తిరువిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన టెక్నాలజీ, ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో డిసెంబరు 4వ తేదీ బొన్సాయ్ మొక్కల పెంపకంపై శిక్షణనున్నట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా డిసెంబరు 5వ తేదీ పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇవ్వనున్నారు. ఔత్సాహికులు 044-29530048 ఫోన్ నెంబరులో సంప్రదించవచ్చు.

1నుంచి నాగూర్‌కు ప్రత్యేక బస్సులు

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ ఆధ్వర్యంలో డిసెంబరు 1 నుంచి నాగూర్‌కు ప్రత్యేక బస్సులు నడవనున్నాయి. నాగూర్ దర్గా కందూరి ఉత్సవాలు డిసెంబరు 2వ తేదీ నుంచి 15వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై, తిరుచ్చి, వేలూరు, మదురై, బెంగళూరు, చిదంబరం, కుంభకోణం, రామనాథపురం తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఈ బస్సులు 1వ తేదీ నుంచి నడవనున్నట్లు రవాణాశాఖాధికారులు తెలిపారు. ఈ బస్సుల్లో రిజర్వేషన్ చేసుకునేందుకు www.tnstc.in అనే వెబ్‌సైట్‌లో గానీ లేదా tnstc యాప్‌లో గానీ సంప్రదించవచ్చు.

రూ.కోటితో అశోకా పార్కు మరమ్మతులు

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లావరం నియోజకవర్గంలోని తిరుత్తణి నగర్, పల్లవా గార్డెన్స్ ప్రాంతంలోని అశోకా పార్క్‌కు మరమ్మతులు చేయనున్నారు చేపడుతున్నారు. చాలాకాలంగా నిరుపయోగంగా వున్న ఈ పార్క్ మరమ్మతు చేపట్టాలని చాలాకాలంగా స్థానికుల నుంచి వినతులు వస్తున్నాయి. దీంతో పల్లావరం నియోజకవర్గ ఎమ్మెల్యే ఇ.కరుణానిధి రూ. కోటి వ్యయంతో పార్కులో ఫుట్‌పాత్, టాయిలెట్లు, చిన్నారులు ఆడుకునే వస్తువులు తదితరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు పనులు గురువారం ప్రారంభమయ్యాయి.

టౌన్ బస్సుల్లో ఆటోమేటిక్ డోర్లు

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎంటీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న బస్సులకు ఆటోమేటిక్ డోర్లు అమర్చినట్లుగానే రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో తిరిగే టౌన్ బస్సులకు కూడా ఆటోమేటిక్ డోర్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థ నిర్ణయించింది. మొత్తం 3 వేల బస్సులకు ఈ డోర్లు అమర్చనున్నారు. రవాణా సంస్థల తరఫున 18 వేలకు పైగా బస్సులు నడుస్తున్నాయి. వీటిలో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకు 10వేల బస్సులు నడుస్తున్నాయి. అయితే ఆయా బస్సుల్లో చాలామంది ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో ఈ పరిస్థితి అరికట్టేందుకు అధికారులు చర్యలకు దిగారు. గతంలో ఎంటీసీలో వున్న పాత బస్సులకుసైతం ఆటోమేటిక్ డోర్లు ఏర్పాటు చేశారు. ఇప్పుడు అదే తరహాలో జిల్లాల్లో నడుస్తున్న 3 వేల బస్సులకు ఆటోమేటిక్ డోర్లు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు.

అర్ధవార్షిక పరీక్షల టైంటేబుల్ విడుదల

పెరంబూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆరు నుంచి 9 తరగతుల అర్ధవార్షిక పరీక్షల టైంటేబుల్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఆప్రకారం, డిసెంబరు 9వతేదీనుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 6,8 తరగతులకు ఉదయం, 7,9తరగతులకు మధ్యాహ్నం పరీక్షలు నిర్వహించనున్నారు.9వతేది తమిళం, 10న ఐచ్ఛిక పాఠ్యాంశం, 12న ఆంగ్లం, 16న గణితం, 18న వ్యాయామం, 20న సైన్స్, 23వ తేది సోషల్ సైన్స్ పరీక్షలు జరుగనున్నాయి.

తిరునిండ్రవూర్‌లో రైల్వే రిజర్వేషన్ కౌంటర్

పెరంబూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరునిండ్రవూర్ రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ గురువారం నుంచి అందుబాటులోకి వచ్చింది. తిరునిండ్రవూర్, చుట్టుపక్కల 32 గ్రామాలకు చెందిన సుమారు 60వేల మంది వరకు ఈ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటుచేయాలని దక్షిణ రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆ ప్రకారం, రూ.50 లక్షలతో నిర్మించిన రిజర్వేషన్ కౌంటర్ గురువారం నుంచి అందుబాటులోకి వచ్చిందని అధికారులు తెలిపారు.

అరుణాచలేశ్వరుడి హుండీ ఆదాయం రూ.3.70 కోట్లు

పెరంబూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వరుడి హుండీ ఆదాయం రూ.3.70 కోట్లు వచ్చిందని అధికారులు తెలిపారు. ఈఆలయానికి వచ్చే భక్తులు స్వామివారికి కానుకలు సమర్పిస్తుంటారు. వాటిని నెలకొకసారి లెక్కిస్తుంటారు. ఈ క్రమంలో, ఐపసి మాసానికి సంబంధించి హుండీల లెక్కింపు గురువారం జరిగింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు రూ.3,70,99,526 నగదు, 1.140 కిలోల వెండి, 230 గ్రాముల బంగారం కానుకగా సమర్పించారని అధికారులు తెలిపారు.

రైళ్లలో కర్పూరం వెలిగించొద్దు

పెరంబూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో కర్పూరం వెలిగించరాదని దక్షిణ రైల్వే విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం శబరిమల సీజన్ కావడంతో అధికశాతం మాల ధరించిన భక్తులు రైళ్లలో శబరిమల వెళ్తుంటారు. అలా వెళ్తున్న భక్తులు పూజచేసే సమయంలో కర్పూరం హారతులిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదులందాయి. ఈనేపథ్యంలో, రైళ్లలో అగ్ని ప్రమాదాలు సంభవించే వస్తువులు తీసుకెళ్లడం నేరమని, అయ్యప్ప భక్తులు సహకరించాలని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

పాత్రికేయుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

● మంత్రి సామినాథన్



ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ద్రావిడ మోడల్ ప్రభుత్వం పాత్రికేయుల సంక్షేమం కోసం కృషిచేస్తోందని రాష్ట్ర తమిళాభివృద్ధి, సమాచార శాఖ మంత్రి ఎంపీ సామినాథన్ పేర్కొన్నారు. ఆయన సచివాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... ప్రజా పాలన రక్షకులైన పాత్రికేయుల సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక బోర్డులో 3,300 మంది సభ్యులుగా చేరారని, ఈ బోర్డు ద్వారా విద్యా ఉపకారవేతనం, వివాహ ఆర్థిక సాయం తదితర 21 రకాల సంక్షేమ సహాయాలను ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 2,431 మంది పాత్రికేయులకు అక్రిడేషన్ కార్డులు, 446 మందికి హెల్త్ కార్డులు అందజేసినట్లు తెలిపారు. పాత్రికేయుల సంక్షేమ బోర్డు కమిటీ ప్రతిపాదన మేరకు పాత్రికేయులకు పింఛన్, మరణించిన వారి కుటుంబాలకు ఆర్థికసాయం అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

షావుకారుపేట షాపులో 3.5 కేజీల బంగారం దోపిడీ

● ఒకరి అరెస్టు, మరోవ్యక్తి కోసం గాలింపు

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక షావుకారుపేటలో ఓ దుకాణంలో పనిచేస్తున్న ఇద్దరు కార్మికులు 3.5 కేజీల బంగారంతో పారిపోయారు. పోలీసులు గాలించి ఓ కార్మికుడిని అరెస్టు చేసి 1.5 కేజీల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో కార్మికుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. కొండితోప్పు లాయర్ చిన్నతంబి వీధికి చెందిన సుశాంత్ షావుకారుపేట ఎన్నెస్సీ బోస్ రోడ్డులో బంగారు దుకాణాన్ని నడుపుతున్నారు. ఆ దుకాణంలో మహారాష్ట్రకు చెందిన సుభం కీరప్పా, యోగేష్ పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం సుశాంత్ పని మీద బయటకు వెళ్ళినప్పుడు దుకాణంలోని 600 గ్రాముల బంగారాన్ని, ఆ దుకాణానికి దగ్గర్లోనే ఉన్న మరో దుకాణంలో భద్రపరిచేందుకు ఇచ్చిన 3 కేజీల బంగారాన్ని తీసుకుని శుభం కీరప్పా, యోగేష్ ఉడాయించారు. సుశాంత్ ఫిర్యాదు మేరకు ఫ్లవర్‌బజార్ పోలీసులు కేసు నమోదు చేసుకుని గాలించారు. ప్రత్యేక బృందం మహారాష్ట్ర వెళ్ళి సుభం కీరప్పాను అరెస్టు చేసింది. అతడి వద్ద నున్న 1.5 కేజీల బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు యోగేష్ పరారీలో ఉండటంతో అతడి ఆచూకీ కోసం ప్రత్యేక దళం పోలీసులు గాలిస్తున్నారు.

ఘనంగా నర్సింగ్ కళాశాల వార్షికోత్సవం



విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తున్న నరువి ఆస్పత్రి స్థాపకుడు జీవీ సంపత్

వేలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తం కాకాతోపులో ఉన్న అత్తి నర్సింగ్ కళాశాలల 5వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి అత్తి విద్యా సంస్థల గ్రూపు అధ్యక్షుడు, అత్తి ఆస్పత్రి ప్రధాన డాక్టర్ సౌందర్‌రాజన్ అధ్యక్షత వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.బాల్‌రాజ్ సీనిదొరై ఆహ్వానం పలికారు. ముఖ్యఅతిథిగా నరువి ఆస్పత్రి స్థాపకులు జీవీ సంపత్ హాజరై వేడుకలు ప్రారంభించారు. అనంతరం కోర్సు పూర్తిచేసుకున్న విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అత్తి ప్రకృతి, యోగా వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డా.తంగరాజ్, గుడియాత్తం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కుమరవేల్, లెక్చరర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శక్తి అమ్మ క్లినిక్ ప్రారంభం



జ్యోతి వెలిగించి క్లినిక్ ప్రారంభిస్తున్న నారాయణి ఆసుపత్రి డైరెక్టర్ బాలాజి

వేలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరియూర్ శక్తి అమ్మ ఆశీస్సులతో నారాయణి ఆస్పత్రి, రీసెర్చి కేంద్రం ఆధ్వర్యంలో క్లినిక్ ప్రారంభించారు. గుడియాత్తం కొత్త బస్టాండ్ సమీపంలో శక్తి అమ్మ క్లినిక్ పేరుతో అధునాతన వసతులు, పరికరాలతో ఏర్పాటుచేశారు. ఈ క్లినిక్‌ను శుక్రవారం శ్రీ పురం నారాయణి ఆస్పత్రి డైరెక్టర్ డా.బాలాజి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో డిజైన్ క్యాప్, పార్మశి ఉప డైరెక్టర్ శ్రీనాధ్ బాలాజి, నిర్వాహకులు పాల్గొన్నారు.

అన్నాడీఎంకే బూత్ కమిటీల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సెక్రటరీ అప్పు

వేలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే అల్లాపురం ప్రాంతానికి చెందిన 51వ డివిజన్ బూత్ కమిటీల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా సెక్రటరీ అప్పు పాల్గొని, బూత్ కమిటీల ఏర్పాటు, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించుకొనేలా వ్యూహాలు తదితరాలను వివరించారు. ఈ సమావేశంలో వార్డు నిర్వాహకులు, శాఖా కార్యదర్శులు పాల్గొన్నారు.


తిరువళ్లూర్‌లో రైతుల గ్రీవెన్స్



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ ప్రభుశంకర్

తిరుత్తణి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం రైతుల గ్రీవెన్స్ జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ ప్రభుశంకర్ రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సమస్యలను సత్వరం పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

మాజీ ఎమ్మెల్యే సుబ్బురాయర్ మృతి



సుబ్బురాయర్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే మాజీ శాసనసభ్యుడు సుబ్బురాయర్ (76) శుక్రవారం ఉదయం మృతి చెందారు. తేని జిల్లా కంభం నందగోపాలసామి ఆలయ వీధిలో నివసిస్తున్న సుబ్బురాయర్ ఎంజీఆర్ వీరాభిమాని. 1984లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కంభం నియోజకవర్గం నుంచి అన్నాడీఎంకే తరఫున పోటీ చేసి గెలిచారు. గత కొద్దిరోజులుగా వృద్ధాప్య సమస్యలతోపాటు అనారోగ్యం కారణంగా తేనిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. శుక్రవారం ఉదయం చికిత్స ఫలించక కన్నుమూశారు. సుబ్బురాయర్ మద్రాసు హైకోర్టు న్యాయవాదిగాను పనిచేశారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్‌కు అస్వస్థత

పెరంబూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ అస్వస్థత కారణంగా రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేరారు. చలి, గొంతు నొప్పితో బాధపడుతున్న ఆయనకు చికిత్స అందిస్తున్నామని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగా ఉన్నారని, త్వరలో డిశ్చార్జి చేస్తామని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

మహాబలిపురంలో రూ.99 కోట్లతో నందనవనం

పెరంబూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం మహాబలిపురంలో సంప్రదాయ నందనవనం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.99.67 కోట్లు కేటాయించిందని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. ఈ విషయమై కేంద్ర మంత్రి తన 'ఎక్స్' పేజీలో... పర్యాటక శాఖ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.3,295 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఆమోదం తెలిపిందన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా మహాబలిపురంలో రూ.99 కోట్లతో నందనవనం, ఊటీలోని దేవాల ఫ్లవర్ పార్క్ అభివృద్ధికి రూ.70.23 కోట్లు కేటాయించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

మేల్‌మరువత్తూర్‌లో 39 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తాత్కాలిక హాల్ట్

పెరంబూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తైపూస వేడుకలను పురస్కరించుకొని మేల్‌మరువత్తూర్ రైల్వేస్టేషన్‌లో 39 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తాత్కాలిక హాల్ట్ కల్పించారు. మేల్‌మరువత్తూర్‌లో ప్రసిద్ధిచెందిన ఆదిపరాశక్తి ఆలయ వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల భక్తులు వస్తుంటారు. వారి సౌకర్యార్థం డిసెంబరు 15 నుంచి ఫిబ్రవరి 12వ తేది వరకు డెల్టా జిల్లాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగుతాయని అధికారులు తెలిపారు.

చెన్నై-అండమాన్ మధ్య 'ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్' విమానాలు

పెరంబూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చెన్నై-అండమాన్ మధ్య ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ డైలీ విమానాలు నడుపనుంది. ఇప్పటికే నగరం నుంచి ఇండిగో, ఆకాషా ఎయిర్, స్పైస్ జెట్, ఎయిర్ ఇండియా తదితర నాలుగు సంస్థలు అండమాన్‌లోని పోర్ట్‌బ్లెయిర్‌కు డైలీ, వీక్లీ విమానాలు నడుపుతున్నాయి. తాజాగా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ జనవరి 1 నుంచి అండమాన్‌కు విమాన సేవలు ప్రారంభించనుంది. ఆ ప్రకారం, నగరం నుంచి ఉదయం 5.05 గంటలకు బయల్దేరే విమానం 7.15 గంటలకు పోర్ట్‌బ్లెయిర్ చేరుకుంటుంది. మరుమార్గంలో ఉదయం 7.55 గంటలకు పోర్ట్‌బ్లెయిర్‌లో బయల్దేరి 10.10 గంటలకు నగరానికి చేరుకుంటుందని ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

ఈవీకేఎస్‌కు కొనసాగుతున్న చికిత్స

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్వాససంబంధిత ఇబ్బందులతో అస్వతతకు గురై నందంబాక్కంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరిన ఈరోడ్ ఈస్ట్ ఎమ్మెల్యే, టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు ఈవీకేఎస్ ఇళంగోవన్‌కు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అత్యవసర చికిత్సా విభాగంలో వెంటిలేటర్‌సాయంతో ఆయన శ్వాసపీల్చుకుంటున్నారు. శ్వాస సంబంధిత సమస్యలు తీవ్రంగా ఉండటం వల్ల సందర్శకులను అనుమతించడం లేదు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యపరిస్థితి నిలకడగానే ఉందని వైద్యనిపుణులు చెప్పారు.

ఏడు ప్రత్యేక కమిటీలతో అన్నాడీఎంకే మండలి ఏర్పాట్లు

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే సర్వసభ్యమండలిని భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఏడు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) తెలిపారు. డిసెంబర్ 15న జరిగే సర్వసభ్యమండలి సమావేశంలో 2 వేలమంది ప్రత్యేక ఆహ్వానితులు, 3 వేలమంది సభ్యులు సహా మొత్తం 5 వేలమంది హాజరుకానున్నారు. వీరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా సదుపాయాల కల్పనకు, వేదిక ఏర్పాట్లు, ఆహారం తయారీ, స్వాగత కమిటీలు, సాంస్కృతిక కమిటీలు ఇలా భారీ ఏర్పాట్ల బాధ్యతలను ఈ ఏడు ప్రత్యేక కమిటీలు నిర్వర్తిస్తాయని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా సర్వసభ్యమండలిలో ప్రతిపాదించాల్సిన తీర్మానాలపై కూడా ఈ కమిటీలు దృష్టిసారించనున్నాయి.

భగవతి అమ్మన్ ఆలయంలో మెటల్ డిటెక్టర్లతో తనిఖీ



భక్తుల లగేజీ తనిఖీ చేస్తున్న పోలీసులు

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారిలోని భగవతి అమ్మన్ ఆలయం వద్ద భక్తుల రద్దీ పెరగడంతో పోలీసులు మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేసి ఆలయంలోకి అనుమతిస్తున్నారు. శబరిమలై వెళ్లే భక్తులు కన్నియాకుమారిలోని భగవతి అమ్మన్ ఆలయాన్ని దర్శించేందుకు రోజూ వేళ సంఖ్యలో తరలివస్తున్నారు. వీరితోపాటు విదేశాల నుంచి కూడా పర్యాటకులు ఈ ఆలయాన్ని సందర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయానికి వచ్చే భక్తులను, వారి లగేజీలను శుక్రవారం నుంచి పోలీసులు మెటల్‌డిటెక్టర్లతో తనిఖీ చేస్తున్నారు.

రోడ్డు విస్తరణ కోసం ఇళ్ల కూల్చివేత



చిన్నకావనంలో రోడ్డుపక్కన ఇంటిని కూల్చివేస్తున్న కార్మికులు

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపం చిన్నకావనం ప్రాంతంల్లో రోడ్డు విస్తరణలో భాగంగా అధికారులు ఇళ్ళ కూల్చివేత ప్రారంభించారు. ఆ జిల్లాలో పుదువాయల్ - పళవేర్కాడు రహదారిని ఫోర్‌వేగా జాతీయ రహదారుల శాఖ విస్తరించనుంది. రూ.45 కోట్లతో 4.2 కి.మీ. రోడ్డును ఫోర్‌వే రహదారిగా మార్చనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి చిన్నకావనంలో రోడ్డుకిరువైపులా ఉన్న దుకాణాలు, ఇళ్ళను కూల్చివేస్తున్నారు.

ఐటీ ఉద్యోగినిపై అత్యాచారం : దంపతుల అరెస్టు

అడయార్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమంగళంలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఐటీ ఉద్యోగినిపై అత్యాచారం చేసి, నగలు, నగదును దోపిడీకి పాల్పడిన కేసులో దంపతులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి భారీ మొత్తంలో నగదు, నగలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. జార్ఖండ్‌కు చెందిన ఓ యువతి నగరంలో ఐటీ కంపెనీలో పని చేస్తున్నారు. ఆమెకు ఫేస్‌బుక్‌లో తిరుమంగళంకు చెందిన పాండిరాజ్ (28) అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ప్రేమ పేరుతో ఆ యువతికి దగ్గరయ్యాడు. పెళ్ళి చేసుకోమని ఒత్తిడి చేయడంతో ఆ యువకుడు ప్లేటు ఫిరాయించాడు. దీంతో ఆగ్రహించిన ఆ యువతి ఆధారాలతో సహా పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో పాండిరాజ్ ఆమెపై లైంగికదాడికి పాల్పడి, ఆమె దగ్గరున్న నగలు, నగదు దోచుకుని పారిపోయాడు. మరుసటి రోజు తన భార్యతో కలిసి వచ్చి ఆ యువతిపై దాడి చేసి గాయపరిచారు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పాండిరాజ్ దంపతులను అరెస్టు చేశారు.

సీఎంసీ ఎదురుగా ఏర్పాటైన ఫుట్ ఓవర్ బ్రిడ్జి



ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు పూర్తి

వేలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాణిపేట సీఎంసీ ఆస్పత్రి ఎదురుగా జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. లిఫ్ట్ సౌకర్యంతో రూ.2 కోట్లతో ఈ బ్రిడ్జి నిర్మించారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, ప్రజలు రోడ్డు దాటేందుకు ఈ బ్రిడ్జి ఎంతగానో ఉపయోగపడుతోందని, ఈ బ్రిడ్జి ఏర్పాటుచేసిన జాతీయ రహదారుల శాఖకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు సీఎంసీ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

వచ్చే నెల నుంచి ఏసీ బోగీలతో సబర్బన్ రైళ్లు

ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చెన్నై బీచ్-తాంబరం మధ్య ఏసీ బోగీలతో సబర్బన్ రైళ్ల సేవలు డిసెంబరు నుంచి అందుబాటులోకి రానున్నాయి. రాజధాని నగరంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు తగినట్లుగా రాష్ట్ర ప్రభుత్వ ఎంటీసీ సంస్థ సిటీ బస్సులు నడుపుతోంది. అయినప్పటికీ, ప్రయాణికుల రద్దీ తగ్గలేదు. మరోవైపు దక్షిణ రైల్వే చెన్నై బీచ్, సెంట్రల్ రైల్వేస్టేషన్, ఎగ్మూర్‌నుంచి నగరం,శివారు ప్రాంతాలకు నడుపుతున్న సబర్బన్ రైళ్లు కూడా నిండిపోతున్నాయి. ఈనేపథ్యంలో, సబర్బన్ రైళ్లలో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఏసీ బోగీలు ఏర్పాటుచేయాలని దక్షిణ రైల్వేకు వినతులు వెళ్లాయి. ఈవిషయమై స్పందించిన దక్షిణ రైల్వే, తొలివిడతగా చెన్నై బీచ్-తాంబరం మధ్య ఏసీ బోగీతో కూడిన సబర్బన్ రైళ్లు నడపాలని నిర్ణయించింది. తాజాగా, 10కి.మీకు రూ.29 ఛార్జీ నిర్ణయించగా, డిసెంబరునుంచి ఈ బోగీలు అనుసంధానం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ట్రిప్లికేన్‌లో రూ.7.5 కోట్ల విలువైన ఆలయ భూముల స్వాధీనం

ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్ నియోజకవర్గంలో కామకళా కామేశ్వరర్ ఆలయానికి సొంతమైన భూములను దేవాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాజా హనుమంత వీధిలో ఆక్రమణకు గురైన రూ.7.5 కోట్ల విలువైన ఈ భూములను అధికారులు స్వాధీఎంం చేసుకున్నారు. హిందూ దేవాదాయ శాఖ నిర్వహణలోని ఆలయాల ఆస్తులు, భూములను ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుంటున్నారు. ఆ రీతిలో ట్రిప్లికేన్‌లోని కామకళా కామేశ్వరర్ ఆలయానికి చెందిన 5,305 చ.అ భూములను కొందరు ఆక్రమించుకున్నారు. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు దేవాదాయ శాఖ అధికారులు శుక్రవారం ఉదయం రాజా హనుమంత వీధిలో ఉన్న భూములు స్వాధీనం చేసుకున్నారు.

చెన్నై విమానాశ్రయ ఆధునికీకరణకు రూ.2,467 కోట్లు

ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విమానాశ్రయాల్లో రూ.2,990.75 కోట్లతో ఆధునికీకరణ పనులు చేపట్టినట్లు కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ లోక్‌సభలో ప్రకటించింది. రాష్ట్రంలో ఉన్న విమానాశ్రయాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి మైలాడుదురై ఎంపీ సుధ లోక్‌సభలో ప్రశ్నించగా, కేంద్ర విమానయాన శాఖ మంత్రి తరఫున రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. అందులో... చెన్నై విమానాశ్రయ ఆధునికీకరణ పథకంలో రెండవ విడతగా రూ.2,467 కోట్లు, రెండో రన్‌వే, ఇతర పనులను రూ.53.66 కోట్లతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విమానాశ్రయంలో రన్‌వేలపై చేరే వర్షపునీటిని ఎప్పటికప్పుడు తొలగించేందుకు రూ.209.10 కోట్లు, 1 నుంచి 4 టెర్మినళ్ల ఆధునికీకరణకు రూ.81.85 కోట్లు కేటాయించి పనులు వేగవంతం చేసినట్లు, అదే విధంగా, మదురై విమానాశ్రయంలో విమానాల రాకపోకల కంట్రోల్ రూమ్ నిర్మాణపనులను రూ.99.02 కోట్లు, తిరుచ్చి విమానాశ్రయంలో కంట్రోల్ టవర్‌ను రూ.80.17 కోట్లతో నిర్మిస్తున్నట్లు ఎంపీ సుధకు సమాధానం చెప్పారు.

రాఘవ లారెన్స్ సహాయకుడి పేరిట మోసం

యువకుడి అరెస్ట్

ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు రాఘవ లారెన్స్ సహాయకుడు పేరుతో రూ.50 వేలు మోసం చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎగ్మూర్ ప్రాంతానికి చెందిన వీరరాఘవన్ ఈ నెల 4వ తేది పోలీసులకు అందజేసిన ఫిర్యాదులో... రాఘవ లారెన్స్ ట్రస్ట్‌లో చదువుకుంటున్న పిల్లలకు ఆర్థిక సాయం చేయాలని, లారెన్స్ సహాయకుడినని పరిచయం చేసుకున్న దినేష్‌కుమార్ తనదగ్గర రూ.50 వేలు తీసుకొని మోసం చేసినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదుచేసిన పోలీసులు, ఆ వ్యక్తి కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో, దినేష్‌కుమార్ వేలూరులో ఉన్నట్లు తెలుసుకొని, అక్కడకు వెళ్లి అదుపులోకి తీసుకొని నగరానికి తీసుకొచ్చి విచారిస్తున్నారు.

అత్యాచారయత్నం కేసులో యువకుడికి 20 ఏళ్ల జైలు

ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తేనిలో ఓ ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలికపై అత్యాచారయత్నం చేసిన కేసులో యువకుడికి న్యాయస్థానం 20 ఏళ్ల జైలుశిక్ష విధించింది. 2020 డిసెంబరు 24వ తేది తేనిలో ఓ ప్రాంతానికి చెందిన అజిత్ తనపై అత్యాచారానికి ప్రయత్నించినట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అజిత్‌పై పోక్సో కేసు నమోదుచేసి అరెస్ట్ చేశారు. తేని జిల్లా పోక్సో సెషన్స్ ప్రత్యేక కోర్టులో సాగిన ఈ కేసు విచారణ పూర్తికావడంతో, నిందితుడు అజిత్‌కు 20 ఏళ్ల జైలు, రూ.15,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి గురువారం తీర్పు వెలువరించారు. అలాగే, బాధితురాలికి రూ.4.85 లక్షలు పరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

కోవై విమానాశ్రయంలో పిస్టల్ స్వాధీనం

ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోవై విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడి నుంచి అధికారులు హ్యాండ్ పిస్టల్ స్వాధీనం చేసుకున్నారు. ఈ విమానాశ్రయం నుంచి గురువారం రాత్రి 10.30 గంటలకు చెన్నై బయల్దేరేందుకు సిద్ధంగా ఉన్న విమాన ప్రయాణికుల లగేజీని అధికారులు తనిఖీ చేశారు. ఆ సందర్భంగా ఓ ప్రయాణికుడి బ్యాగులో హ్యాండ్ పిస్టల్ గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకొని జరిపిన విచారణలో... ఈరోడ్‌కు చెందిన శక్తివేల్ (40) అని మాంగాడులో వ్యాపారం చేస్తున్నందున కోవై విమానాశ్రయానికి వెళ్లినట్లు తెలిసింది. హ్యాండ్ పిస్టల్ స్వాధీనం చేసుకొని, దానికి లైసెన్స్ ఉందా? లేదా? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

ఊటీకి ప్రత్యేక రైళ్లు

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్, న్యూ ఇయర్, అర్ధసంవత్సర సెలవులను పురస్కరించుకుని ఊటీ నుంచి పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణరైల్వే ప్రకటించింది. వివరాలిలా వున్నాయి... డిసెంబరు 25, 27, 29, 31వ తేదీల్లో ఉదయం 9.10 గంటలకు మేట్టుపాళయంలో బయలుదేరే ప్రత్యేక రైలు మధ్యాహ్నం 2.25 గంటలకు ఊటీ చేరుకుంటుంది. 26, 28, 30, జనవరి 1వ తేదీల్లో ఉదయం 11.30 గంటలకు ఊటీలో బయలుదేరే ప్రత్యేక రైలు సాయంత్రం 4.20 గంటలకు మేట్టుపాళయం చేరుకుంటుంది.

కున్నూరు - ఊటీ మధ్య: కున్నూరు- ఊటీ మధ్య ప్రత్యేక రైళ్లువచ్చే డిసెంబరు 25వ తేదీ నుంచి జనవరి 2వ తేదీ వరకు ఆరు రోజుల పాటు కున్నూరు-ఊటీ మధ్య ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. కున్నూరు నుంచి ఉదయం 8.25 గంటలకు బయలుదేరే ప్రత్యేక రైలు 9.45 గంటలకు ఊటీ చేరుకుంటుంది. అదేవిధంగా ఊటీ నుంచి సాయంత్రం 4.45 గంటలకు బయలుదేరే ప్రత్యేకరైలు 5.55 గంటలకు కున్నూరు చేరుకుంటుంది.

ఊటీ-కేథి మధ్య ప్రత్యేక రైలు: ఊటీ-కేథి మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. ఊటీలో ఉదయం 9.45, 11.30, మధ్యాహ్నం 3.00, కేథిలో ఉదయం 10.30, 12.40, సాయంత్రం 4.00 గంటలకు బయలుదేరే ప్రత్యేక రైళ్లు అరగంటకు గమ్యస్థానం చేరుకుంటాయి. ఆయా రైళ్లకు ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు.

కోవై కాంగ్రెస్ శ్రేణుల ఘర్షణపై విచారణ

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై

ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోవైలో ఈ నెల 17వ తేది కాంగ్రెస్ శ్రేణుల మధ్య జరిగిప ఘర్షణపై ఐదుగురు ఎంపీలతో కూడిన కమిటీ విచారణ జరుపుతుందని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై తెలిపారు. రాయపేటలోని టీఎన్‌సీసీ కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సెల్వపెరుందగై మాట్లాడుతూ... ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు కోవై కాంగ్రెస్ నిర్వాహకుల ఘర్షణ సంఘటనపై ఎంపీలు జ్యోతిమణి, సుధ, గోపినాత్, రాబర్ట్ బ్రూస్, శశికాంత్ సెంథిల్ శుక్రవారం నుంచే విచారణ ప్రారంభించారని, వారి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు సెల్వపెరుందగై తెలిపారు.

హైవే పనుల పరిశీలన



నిర్మాణాలు పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి డివిజన్ మేల్‌పాడి సమీపంలో బెంగళూరు-చెన్నై జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. నిర్ణీత కాలంలో పనులు పూర్తిచేసేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జాతీయ రహదారి పథక డైరెక్టర్ సావిత్రి దేవి, పథక మేనేజర్ హైక్, ఇంజనీర్ జయకుమార్ తదితరులున్నారు.

వేగవంతమైన కంప్యూటర్ యుగంలో మహిళలు రాణించని రంగమంటూ ఏదీ లేదు. ఆ కోవలోనే రాజధాని నగరం చెన్నైలో 700 మంది మహిళలు సమష్టిగా 'వీర పెణ్‌గళ్ మున్నేట్ర తొళిర్‌సంఘం' పేరుతో ఓ సంఘాన్ని ఏర్పాటు చేసుకుని ఆటోలను నడుపుతున్నారు. ఒకే కార్మిక సంఘంలో ఉంటూ ఆటోలను నడిపి తమ కుటుంబ ఖర్చుల కోసం సంపాదిస్తున్నారు. ప్రస్తుతం ఈ కార్మికసంఘంలో వెయ్యి మంది వరకు సభ్యులున్నారు. మరో 4 వేల మంది మహిళలను సభ్యులుగా చేర్చి ఆ సంఘాన్ని ఉన్నతస్థితికి తీసుకెళ్లే ప్రయత్నంలో ఉన్నారు. మహిళల దృష్టిని స్వయం సంపాదనవైపు మళ్ళించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని, వారిలో ఆత్మస్థైర్యం నింపేలా మహిళా ఆటో డ్రైవర్ల కోసమే ఆ కార్మిక సంఘాన్ని నిర్వహిస్తున్న నగరానికి చెందిన సీనియర్ ఆటో డ్రైవర్ మీనాక్షి తన అనుభవాలను 'తరుణి'తో పంచుకున్నారు.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

తరుణి

సంఘం ప్రారంభం...

నేనూ, భవానీ కలిసి ఆటో నడుపుతుండటం గమనించి పలువురు మహిళలు మా వద్దకు వచ్చి, ఆటో డ్రైవింగ్ ఎక్కడ నేర్చుకున్నారు? మాకు కూడా నేర్పించరా అంటూ అడిగారు. వీరిలాగే ఆటో నడిపేందుకు ఆసక్తి కనబరుస్తున్నవారందరికీ ట్రైనింగ్ ఇవ్వాలని అనుకున్నాం. ఆ ప్రకారమే నేనూ భవానీ కలిసి 'భారతి కనవు పెణ్‌గళ్' అనే సంఘాన్ని ప్రారంభించాము. ఆ సంఘం ద్వారా ఆటో డ్రైవింగ్ నేర్పిస్తున్నాం.



మహిళల ఆర్థికాభివృద్ధే నా ఆశయం

- వనితలను స్వయం ఉపాధివైపు మళ్ళించడమే లక్ష్యం
- సిటీ సీనియర్ ఆటో డ్రైవర్ మీనాక్షి



ఆటో నడుపుతూ...

మీనాక్షి

27 యేళ్ల అనుభవం...

నా సొంతూరు షోళింగనల్లూరు. అందరిలాగే వివాహమై గృహిణిగానే నా జీవితమూ ప్రారంభమైంది. కొన్నేళ్లు గడిచాకా జీవితం బోర్‌కొట్టింది. ఏదైనా వ్యాపకంతో గడపాలని ఆశపడ్డాను. ఆ సమయంలో చెన్నై ఆటో సొసైటీ ద్వారా ఆటో డ్రైవింగ్ లో శిక్షణ ఇస్తున్నట్లు తెలుసుకున్నాను. వెంటనే ఆ శిక్షణా కేంద్రంలో చేరి ఆటో డ్రైవింగ్ నేర్చుకున్నాను. ఆ కేంద్రంలో ట్రైనింగ్ కోసం అప్పటికే సుమారు వెయ్యిమంది వరకు మహిళలు చేరారు. అయితే వారిలో 20 మంది మాత్రమే శిక్షణ సమర్థవంతంగా పూర్తి చేయగా, వారిలో నేనూ ఉన్నాను. ఆ తర్వాత స్టీరింగ్ పట్టుకుని విరామం లేకుండా 1996నుండి ఇప్పటి వరకూ ఆటో నడుపుతూనే ఉన్నాను. నేనే కాకుండా నా స్నేహితురాలు భవానికి ఆటో డ్రైవింగ్ నేర్పించాను. ప్రస్తుతం ఇద్దరమూ నగరంలో ఆటో నడుపుతున్నాం.

ఆటోలు కొనిస్తాం..

సాధారణంగా మహిళలు తమకోసం సంపాదించాలని భావించరు. కుటుంబ సంరక్షణకే పరిమితమైపోతారు. భర్త సంపాదనపైనే ఆధారపడి జీవించాలని కోరుకుంటారు. ఆ భావన నుంచి బయటపడి కుటుంబ భారాన్ని భర్తతో పాటు మోయాలని అనుకుంటే, ఏదో ఒక వృత్తి చేపట్టాల్సిందే. ఇద్దరూ కలిసి సంపాదిస్తేనే ఆ కుటుంబం బాగుపడుతుంది. మా వద్దకు వచ్చే మహిళలకు ముందుగా ఆటో నడపటం నేర్పుతాం. ఆ తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ తెప్పించి, ఆటో కొనుక్కొనేందుకు కూడా సాయపడుతున్నాం. ఈ సంఘాన్ని ప్రారంభించినప్పుడు తొమ్మిది మంది మహిళలే సభ్యులుగా ఉండేవారు. ఆ సమయంలో కరోనా లాక్‌డౌన్ పరిస్థితులు కూడా ఎదురయ్యాయి. మా సంఘంలోని మహిళలకే కాకుండా ఇతరులకు కూడా సహాయ సహకారాలు అందించాం. మహిళలు ఐకమత్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చునని కరోనా పరిస్థితులు మాకు పాఠం నేర్పాయి. ఆ తర్వాత మా సంఘం అంచెలంచెలుగా ఎదిగింది. వెయ్యి మందికిపైగా సభ్యులు చేరడంతో ప్రభుత్వం నుంచి కూడా ఆటోలు కొనేందుకు ఆర్థిక సాయం పొందగలుగుతున్నాం. మా సంఘం ద్వారా ఆటోలను మహిళలు నడపటం వల్ల వారి భద్రత కోసం ఆటోల్లో జీపీఎస్ పరికరాలను కూడా అమర్చాం. మా సంఘం సభ్యులందరికీ ఆటో అంటే మా కుటుంబంలో ఓ సభ్యుడిగానే భావిస్తుంటాం. అంతేకాకుండా మా సంఘంలో భర్త నుంచి నిరాదరణకు గురైన మహిళలు కూడా ఉన్నారు. పలువురు మహిళలు స్కూళ్లకు వెళ్లే బాలబాలికలను ఆటోల్లో తీసుకెళ్ళి నెలవారి సంపాదిస్తున్నారు. ప్రస్తుతం 1000 మంది వున్న మా సంఘం సభ్యుల సంఖ్యను 5 వేలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆ దిశగానే చర్యలు చేపడుతున్నాం. మహిళలను స్వయం సంపాదన దిశగా అభివృద్ధి పరచడమే మా ఆశయం..అటూ మీనాక్షి తన లక్ష్యాన్ని వివరించారు.



శిక్షణ పొందుతున్న మహిళలు





సంఘంలోని సభ్యులు

సంగీత దర్శకుడిని ముప్పతిప్పలు పెడుతున్న సుచిత్ర!



శక్తి ఆర్ సెల్వ - సుచిత్ర

సంగీత దర్శకుడు శక్తి ఆర్.సెల్వను గాయని సుచిత్ర ముప్పుతిప్పలు పెడుతున్నారు. సెల్వ - సుచిత్ర కలిసి రూపొందించిన ఒక ఆల్బమ్ ప్రచార కార్యక్రమాలకు రాకపోవడమే కాకుండా, తన ఫొటోను కూడా ఉపయోగించరాదని సుచిత్ర షరతు విధించారని శక్తి ఆర్ సెల్వ ఆరోపించారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ, 'గాయని సుచిత్రలో కలిసి 'టైటానిక్ సన్నిసన్ని' అనే మ్యూజిక్ ఆల్బమ్ రూపొందించాను. ఈ పాట ప్రమోషన్ కోసం ఆమె ఏమాత్రం సహకరించడం లేదు. పైగా రికార్డింగ్ సమయంలో నా పట్ల దురుసుగా ప్రవర్తించారు. దీనికి సంబంధించిన వీడియో కూడా బహిర్గతం చేశాను. మహిళల్లో తనకు మంచి పేరు ఉందని, అందువల్ల తన పేరు, ఫొటో ఎక్కడా ఉపయోగించడానికి వీల్లేదని ఆమె షరతు విధించారు. దివంగత కె.బాలచందర్, సంగీత దర్శకుడు కార్తీక్ రాజా, గేయ రచయిత వైరముత్తు వంటివారిపై అనేక అసత్య ఆరోపణలుచేసిన గాయని... ఇపుడు మాత్రం ఆమె నటించిన ఆల్బమ్ సాంగ్ గురించి ప్రమోషన్ చేయమంటే ససేమిరా అంటున్నారు. గత రెండేళ్ళుగా ఆమెకు ఎలాంటి అవకాశాలు లేవు. ఈ కారణంగానే ఆమె వాయిస్‌ను శ్రోతలకు వినిపించాలన ఉద్దేశంతో ఈ ఆల్బమ్ రూపొందించాను. కానీ, సుచిత్ర ప్రమోషన్‌కు రాకపోవమేకాకుండా నా పట్ల దురుసుగా ప్రవర్తించారు' అని శక్తి ఆర్.సెల్వ ఆరోపించారు. కాగా, హీరో కరణ్ నటించిన 'కంద' చిత్రానికి సంగీతం సమకూర్చిన సెల్వ.. అనారోగ్యం కారణంగా ఇండస్ట్రీకి దూరంగా ఉన్నారు. ఇపుడు మళ్ళీ మ్యూజిక్ ఆల్బమ్‌లు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

శివకార్తికేయన్‌కు అరుదైన సత్కారం



శివకార్తికేయన్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఓటీఏ ఉన్నతాధికారి

హీరో శివకార్తికేయన్‌కు అరుదైన సన్మానం జరిగింది. స్థానిక సెయింట్ థామస్ మౌంట్‌లోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడెమీ (ఓటీఏ) ఉన్నతాధికారులు ఎస్కేను ప్రత్యేకంగా అభినందించారు. రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వంలో శివకార్తికేయన్ - సాయిపల్లవి జంటగా నటించిన 'అమరన్' అక్టోబరు 31వ తేదీన విడుదలై ఘన విజయం సాధించడంతో ఏకంగా రూ.300 కోట్ల మేర కలెక్షన్లు వసూలు చేసింది.. ఇప్పటికీ విజయవంతంగా ప్రదర్శితమవుతుంది. ఈ నేపథ్యంలో ఓటీఏకు చెందిన ఉన్నతాధికారులు ఎస్కేను ప్రత్యేకంగా ఆహ్వానించి గౌరవించారు. 'అమరన్' చిత్రంలో మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్రలో జీవించారంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ విషయాన్ని రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ నిర్మాణ సంస్థ వెల్లడించడంతో పాటు ఫొటోలను కూడా షేర్ చేసింది.

సూర్య కొత్త చిత్రం టైటిల్ అదేనా?



కొత్త చిత్రం ప్రారంభోత్సవం

కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో హీరో సూర్య నటిస్తున్న 44వ చిత్రానికి 'కల్ట్' అనే టైటిల్ ఖరారు చేయాలని నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించే ఈ చిత్రాన్ని ఒక ప్రేమకథా చిత్రంగా రూపొందిస్తున్నారు. . అయితే, కల్ట్ పేరుతో అథర్వ హీరోగా ఒక టైటిల్ నిర్మాతల సంఘంలో రిజిస్టర్ చేసి వుంది. అందువల్ల ఆ టైటిల్ కోసం సంబంధిత నిర్మాతను సంప్రదిస్తున్నారు. ఆ నిర్మాత అంగీకరిస్తే సూర్య-44కు 'కల్ట్' అనే పేరు అధికారికంగా వెల్లడించనున్నారు. ఇదిలావుండగా 'సూర్య-45' చిత్రం ప్రారంభోత్సవం తాజాగా ఆనైమలై మాసాణి ఆలయంలో జరిగింది. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించే ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ఆర్ ప్రభు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తొలి రోజు షూటింగ్‌లో హీరో సూర్య, కొందరు నటీనటులపై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. వచ్చే యేడాది ద్వితీయార్థంలో ఈ చిత్రాన్ని విడుదల చేసేలా ప్లాన్ చేశారు. అలాగే, ఇందులో నటించే నటీనటుల వివరాలను అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. కాగా, సూర్య నటించిన భారీ బడ్జెట్ చిత్రం 'కంగువా' బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచిన విషయం తెల్సిందే.

చిత్రజ్యోతి

నాన్న వాయిస్ రీక్రియేట్‌కు అంగీకరించను : ఎస్పీ చరణ్



తన తండ్రి, గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం వాయిస్‌ను ఏఐ టెక్నాలజీ సాయంతో రీక్రియేట్ చేయడానికి అంగీరించబోమని ఆయన తనయుడు, గాయకుడు ఎస్పీ చరణ్ స్పష్టం చేశారు. అలా చేయడం వల్ల ఆ వాయిస్ సహజత్వం పోతుందని అందుకే నో చెప్పానని తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'వేట్టయన్' చిత్రంలో దివంగత గాయకుడు మలేసియన్ వాసుదేవన్ గాత్రాన్ని ఏఐతో రీక్రియేట్ చేసిన 'మనసిలాయో' పాట గురించి ప్రస్తావన రాగా, దీనిపై చరణ్ స్పందిస్తూ, 'ఏఐ సాంకేతికతతో ఒకరి వాయిస్‌ను రీక్రియేట్ చేయడానికి నేను వ్యతిరేకిని. ఇటీవల వచ్చిన మనసిలాయో పాట చాలా హిట్ అయింది. ఒకవేళ తన తండ్రి జీవించివుంటే ఆ పాట కోసం ఆయన్ను సంప్రదించేవారేమో. మలేషియా వాసుదేవన్, ఎస్పీబీలపై మనకున్న ప్రేమాభిమానాల కారణంగా వారి వాయిస్‌ను రీక్రియేట్ చేయాలనిపిస్తుంది. వారు ఎన్నో అద్భుతమైన పాటలను పాడారు. ఏఐని ఉపయోగించి మీరు స్వరాన్ని రీక్రియేట్ చేయగలరు. పాట వినడం వల్ల కలిగే భావోద్వేగాలను రీక్రియేట్ చేయలేరు. తన తండ్రి ఎస్పీబీ వాయిస్‌ను రీక్రియేట్ చేసేందుకు పలువురు సంప్రదించగా, నేను తిరస్కరించాను. అలా చేయడం వల్ల ఆ స్వరం సహజత్వం ఉండదు. అలాంటి గొంతుక వినడం నాకు, నా కుటుంబానికి ఇష్టంలేదు. అందుకే ఓ సంగీత దర్శకుడుగా కూడా దీనిని వ్యతిరేకించాను. నా తండ్రి భౌతికంగా లేకపోయినా ఆయన పాడిన పాటల రూపంలో ఎప్పటికీ జీవించే ఉంటారు' అని చరణ్ అన్నారు.

కొడైకెనాల్‌లో కేంద్ర ఎన్నికల కమిషనర్



సుక్బీర్‌సింగ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దిండుగల్ కలెక్టర్ పూంగొడి

ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల కమిషనర్ సుక్బీర్ సింగ్ చంద్ రెండు రోజుల పర్యటన కోసం శుక్రవారం కొడైకెనాల్ చేరుకున్నారు. కుటుంబ సభ్యులతో కలసి వచ్చిన ఆయనకు దిండుగల్ కలెక్టర్ పూంగొడి పుష్పగుచ్ఛం సాగరంగా ఆహ్వానించారు. శనివారం వరకు కొడైకెనాల్‌లో బసచేసి, అక్కడున్న పర్యాటక ప్రాంతాలు, బొటానికల్ గార్డెన్ తదితరాలను వీక్షించనున్న ఎన్నికల కమిషనర్, ఆదివారం ఉదయం కొడైకెనాల్ నుంచి ఊటీకి వెళతారని అధికారులు తెలిపారు.

లండన్ మ్యూజియంలో తిరుమంగై ఆళ్వార్ విగ్రహం



తిరుమంగై ఆళ్వార్ విగ్రహం

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుంభకోణం సౌందర రాజ పెరుమాళ్ ఆలయంలో 67 యేళ్ల క్రితం అపహరణకు గురైన తిరుమంగై ఆళ్వార్ విగ్రహాన్ని స్వస్థలానికి రప్పించే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నట్లు విగ్రహాల అక్రమ రవాణా నిరోధక విభాగం ఉన్నతాధికారులు తెలిపారు. ఆ విగ్రహం ఆచూకీ కోసం ఆ విభాగం ఐజీ దినకరన్, ఎస్పీ శివకుమార్ నాయకత్వంలో ప్రత్యేక బృందాలు ముమ్మరంగా గాలించి ఆ విగ్రహం లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం మ్యూజియంలో ఉన్నట్లు కనుగొన్నారు. కోట్లు విలువచేసే అత్యంత ప్రాచీనమైన ఆ విగ్రహాన్ని త్వరలో స్వస్థలానికి తరలించనున్నారు.



చెన్నై సచివాలయంలో వ్యవసాయ శాఖలో అమలు చేస్తున్న పథకాలపై అధికారులతో సమీక్ష జరుపుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



రక్షణ శాఖామంత్రిని కలిసిన అమరన్ చిత్ర బృందం

ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖామంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్న 'అమరన్' చిత్ర హీరో శివకార్తికేయన్, దర్శకుడు రాజ్ కుమార్ పెరియస్వామి, సహ నిర్మాత ఆర్.మహేంద్రన్ తదితరులు

నేత్రపర్వంగా వరదణేశ్వర స్వామి తెప్పోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

తిరుత్తణి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరువళంగాడు వదరణేశ్వరస్వామి తెప్పోత్సవం గురువారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. తిరువళ్లూర్ జిల్లాలోని తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న ఈ ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా వేడుకలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేశారు. అనంతరం కొలనులో విద్యుద్దీపాలతో అందంగా అలకరించిన తెప్పలో ఉత్సవమూర్తులకు నావికోత్సవం జరిపారు. స్వామివారి తెప్పోత్సవం తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

2,553 వైద్య పోస్టుల భర్తీ

- మంత్రి ఎం.సుబ్రమణ్యం



ప్యారీస్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2,553 వైద్య పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టినట్లు ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం పేర్కొన్నారు. సచివాలయంలో మంత్రి శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వుల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యుల కొరతపై వివరాలు సేకరించామని, ప్రస్తుతం ఖాళీగా ఉన్న 2,553 పోస్టులకు అర్హులైన వారిని ముందుగానే ఎంపిక చేయనున్నట్లు మంత్రి వివరించారు. మొత్తం 23,917 దరఖాస్తులను పరిశీలన జరుగుతోందని, ఆన్‌లైన్‌లో 2026 జనవరి 27వ తేది రాతపరీక్ష నిర్వహించనున్నట్లు ఇదివరకే ప్రకటించామని, అయితే సీఎం సూచనల మేరకు రెండు రోజుల ముందే ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్యుల పదోన్నతికి సంబంధించిన కేసులకు పరిష్కారం వచ్చిందని, మరో వారం రోజుల్లో 428 మంది వైద్యులకు పదోన్నతి ఉత్తర్వులు అందజేయనున్నట్లు మంత్రి సుబ్రమణ్యం తెలిపారు. కొవిడ్ సమయంలో డ్యూటీ చేసిన 940 మందిని కాంట్రాక్ట్ వేతన జాబితాలో చేర్చామని, వీరిని కూడా పర్మినెంట్ చేయడంపై ప్రభుత్వం పరిశీలిస్తోందని చెప్పారు. మీడియా సమావేశంలో ఆరోగ్య శాఖ డైరెక్టర్ సెల్వవినాయగం, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శంఖుమణి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో 'నిభవ్ హోం లిఫ్ట్స్ కర్మాగారం



చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆసియాలో అతిపెద్ద హోం ఎలివేటర్ బ్రాండ్ అయిన నిభవ్ హోమ్ లిఫ్ట్ చెన్నైలో ఐదవది, అతి పెద్ద తయారీ కేంద్రాన్ని ప్రారంభించింది. తద్వారా తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని 7,500 యూనిట్ల నుంచి 15000 యూనిట్లకు పెంచుకుంది. ఇరుంగాట్టు కోట్టైలో, లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించిన ఈ కేంద్రంలో 450 మందికి ఉద్యోగాలను కల్పించారు. దీని గురించి నిభవ్ సంస్థ సీఈవో విమల్ బాబు మాట్లాడుతూ.. ఈ కేంద్రం విస్తరణ ద్వారా 12 కంటే ఎక్కువ దేశాల నుంచి వస్తున్న డిమాండు తీర్చడానికి సిద్ధంగా వున్నామని తెలిపారు.


కొలపాక్కంలో నేచురల్స్ సెలూన్'



చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొలపాక్కం పద్మావతి నగర్‌లో నేచురల్స్ సెలూన్ 149వ బ్రాంచ్ ఏర్పాటైంది. ప్రముఖ నటి శరణ్య, సంస్థ భాగస్వామి కవితా షణ్ముగం, నరేంద్రన్ షణ్ముగం, సీకే కుమార్‌వేల్ తదితరులు ఈ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఆధునిక యువత అభిరుచులకుగుణంగా కేశ సంరక్షణతో పాటు అన్ని రకాల బ్యూటీ సర్వీసులు కూడా వుంటాయని వివరించారు.

వాన జల్లుల్లో చల్లని తల్లి వేడుకలు





బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 8 గంటలకు ముత్యపు పందిరి
- మధ్యాహ్నం 12.30 గంటలకు స్నపన తిరుమంజనం
- సాయంత్రం 5.30 గంటలకు ఊంజల్‌సేవ
- రాత్రి 7 గంటలకు సింహవాహనం

పెద్ద శేష వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు వాన జల్లుల నడుమ వేడుకలు ఘనంగా కొనసాగాయి. సుప్రభాతసేవ అనంతరం సహస్రఅర్చన, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం వాహన మండపంలో పట్టు పీతాంబరాల వజ్రవైడూర్యాలు స్వర్ణాభరణాలతో అమ్మవారిని అలంకరించి పెద్దశేషుడిపై అధిష్ఠింపజేశారు. ఉదయం పరమపద వైకుంఠనాథుని రూపంలో పెద్దశేష వాహనంపై తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను సాక్షాత్కరించారు. వర్షం కారణంగా కొంతసేపు ఘటటోపం నిడన అమ్మవారి వాహనసేవ సాగింది. సాయంత్రం 6 గంటలకు వీణచేతపట్టిన సరస్వతిదేవిగా శ్వేతవర్ణ పట్టువస్త్రం, వజ్రవైడూర్య స్వర్ణాభరణాలతో ఊంజల్‌సేవలో అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. అనంతరం ఆస్థాన మండపం నుంచి వేంచేవుగా వాహన మండపానికి తీసుకొచ్చి అమ్మవారి ఉత్సవమూర్తిని హంసవాహనంపై కొలువుదీర్చారు. రాత్రి గజతురగ అశ్వాలు ముందుకు సాగుతుండగా భక్తుల కోలాటాలు, భజన బృందాలు, మంగళవాయిద్యాలు, జీయర్ స్వాముల ప్రబంధపారాయణం నడుమ అమ్మవారు హంసవాహనంపై ఆలయ మాడవీధుల్లో ఊరేగారు. భక్తులతో ఆలయ మాడవీధులు కిక్కిరిసిపోయాయి. ఈ కార్యక్రమాల్లో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్‌బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, చలపతి, సుభాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి











శ్రీవారికి వైఖానసం.. అమ్మవారికి పాంచరాత్రం ఎందుకిలా?

తిరుమలేశుడికి వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం నిత్య కైంకర్యాలు, పూజలు, ఉత్సవాలు నిర్వహిస్తే, ఆయన దేవేరి పద్మావతి అమ్మవారికి పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా వీటిని నిర్వహిస్తారు. ఎందుకు ఇలా.. అనే సందేహానికి అమ్మవారి ఆలయ అర్చకులు, కంకణభట్టార్ కాండూరు శ్రీనివాసాచార్యులు ఇలా వివరించారు...

"నిత్య కైంకర్యాలు, పూజలు, ఉత్సవాలు ఎలా నిర్వహించాలి.. అనే అంశాన్ని వైకుంఠంలో శ్రీమహావిష్ణువు అయిదు రాత్రుల పాటు అమ్మవారికి వివరించారట. తొలుత అమ్మవారికి ఆ తర్వాత వరుసగా ఆదిశేషుడు, గరుత్మంతుడు, బ్రహ్మ, పరమేశ్వరులకు ఐదురాత్రుల ఆగమశాస్త్రాన్ని ఉపదేశించారు. సాక్షాత్తు స్వామివారే ఐదు రాత్రులు ఉపదేశించడం వల్ల ఈ శాస్త్రానికి పాంచరాత్ర ఆగమశాస్త్రం అనే పేరువచ్చింది. ఆ తర్వాత దీనిని 40వేల మంది ఋషులు- మహాఋషులు, దాన ఋషులు, బ్రహ్మఋషులు, రాజ ఋషులు 1006 సంహితరూపంగా రచించి అందించారు. అందులో 108 సంహితాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వీటి ఆధారంగానే ఆయా ఆలయాల్లో ఒక్కొక్క సంహితను అనుసరించి పూజలు నిర్వహిస్తున్నారు. ఇది మనసుల్లో అజ్ఞానాన్ని పోగొట్టి జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. తిరుచానూరు అమ్మవారి ఆలయంతోపాటూ భద్రాచలం, శ్రీకూర్మం, సింహాచలం, శ్రీరంగం, కంచి, కుంభకోణం, కురుక్షేత్రం, ఒంటిమిట్ట తదితర ఆలయాల్లో పాంచరాత్ర ఆగమశాస్త్రంను అనుసరించే పూజలు జరుగుతున్నాయి. వైఖాననసం విషయానికి వస్తే.. తిరుమల శ్రీవారి ఆలయంతోపాటూ, నాగలాపురం, నారాయణవనం, అప్పలాయగుంట, శ్రీనివాస మంగాపురం, కార్వేటినగరం, గోవిందరాజస్వామి ఆలయం, కీలపట్ల తదితర ఆలయాల్లో స్వామివార్లకు వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం నిత్యకైంకర్యాలు, పూజలు, ఉత్సవాలు నిర్వహిస్తారు."



కాండూరు శ్రీనివాసాచార్యులు

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

ఫల పుష్పాలే మాలలుగా.. తిరుమంజన సేవ

అమ్మవారి స్పర్శ క్షణకాలమే అయినా పవిత్రమైనది.. అపురూపమైనది. స్నపనతిరుమంజన కార్యక్రమంలో ఉత్సవమూర్తికి చేసే అలంకరణలు స్వల్పకాలానికే పరిమితమైనా విభిన్నంగా కొనసాగుతాయి. పూలు, ఫలాలు, ఎండు ఫలాలతో మాలలు కట్టి అలంకరిస్తారు. ఏదీ కొన్ని నిముషాలకు మించి అమ్మవారి మెడలో ఉండదు. అయినా ప్రత్యేకంగా ఫల, పుష్పాలతో అలంకరించిన శ్రీకృష్ణ ముఖ మండపంలో ఈ స్నపన తిరుమంజనసేవ జరుగుతుంది. శుక్రవారం మధ్యాహ్నం కంకణభట్టర్ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన సేవలో ఏడు రకాల మాలలను అమ్మవారికి అలంకరించారు. ఇందులో నెమలి ఈకలు, తామర పూల గింజలు, పైనాపిల్, రోజ్ పెటల్స్, నందివర్ధనం మొగ్గలు, తులసిమాలలు, కిరీటాలు, గొడుగులు ఉన్నాయి. ఈ మాలలను ఓ భక్తుడు అమ్మవారికి కానుకగా అందించారు. మండపాన్ని వివిధ రకాల సాంప్రదాయ పుష్పాలు, కట్ ప్లవర్స్‌తో పాటు ఆపిల్, జామ, మొక్కజొన్న, ఆర్కిడ్స్, పైనాపిల్ వంటి ఫలాలతో అలంకరించారు.



ఫలపుష్పాలతో ఆకట్టుకుంటున్న కేటీ మండపం



ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు



నెమలి ఈకలు, తామర గింజలు, నెల్లికాయ మాలలు

ఫిబ్రవరి 21 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఫిబ్రవరి 21 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 21 నుంచి మార్చి 6వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 21న కన్నప్ప ధ్వజారోహణం, 22న స్వామివారి ధ్వజారోహణం, 26న మహాశివరాత్రి, రాత్రి నందిసేవ, 27న ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 28న స్వామిఅమ్మవార్ల కల్యాణం, 1న సభాపతి కల్యాణం, 2న కైలాసగిరి ప్రదక్షిణ, 3న ధ్వజావరోహణం, 4న పల్లకీసేవ, 5న ఏకాంతసేవ, 6న శాంతి అభిషేకం జరుగుతుందన్నారు.

నేడు అష్టోత్తర శత కలశాభిషేకం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఉదయం అష్టోత్తర శతకలశాభిషేకం, బిల్వ నిమజ్జనం నిర్వహించనున్నట్టు ఈవో బాపిరెడ్డి తెలిపారు. అలాగే సాయంత్రం 7గంటలకు స్వర్ణముఖిలో నదీ హారతులు జరుగుతాయని తెలిపారు. అందుకు కావాల్సిన ఏర్పాట్లును కూడా పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 23 కంపార్టుమెంట్లలో సర్వదర్శనం భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. కాగా, బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి రూ.3.84 కోట్లు ఆదాయం లభించినట్లు శుక్రవారం ఉదయం ప్రకటించింది. గురువారం 56,952 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 21,714 మంది తలనీలాలు సమర్పించారు.

త్వరలో జైలుకు ముగ్గురు వైపీసీ నేతలు

సమస్యల పరిష్కారానికి మండలాల వారీగా ప్రత్యేక సిబ్బంది ● ఎమ్మెల్యే సుధీర్ వెల్లడి

శ్రీకాళహస్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అక్రమార్కులను త్వరలోనే జైలుకు పంపుతామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం ప్రజాసమస్యల పరిష్కారం కోసం మండలాల వారీగా సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ల జాబితాను విడుదల చేసిన ఆయన.. మీడియాతో మాట్లాడారు. శ్రీకాళహస్తిలో కొందరు వైసీపీ నాయకులు ఐదేళ్లపాటు సాగించిన దుర్మార్గాలను వెలికి తీస్తున్నట్లు చెప్పారు. మరో మూడు రోజుల్లోనే ముగ్గురు వైసీపీ నాయకులు జైలుకు వెళ్లబోతున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం మండలాల వారీగా ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణానికి మనోజ్ కుమార్‌ను 94917 06316 నెంబరులో సంప్రదించాలని సూచించారు. అలాగే శ్రీకాళహస్తి మండలానికి మణెమ్మ (70321 78191), తొట్టంబేడుకు భారతి (91820 31426), ఏర్పేడుకు హేమ (94418 55838), రేణిగుంటకు సుజాత (83670 90320)ను నియమించామన్నారు. ఈ మేరకు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. పలువురు బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



అన్నా.. చనిపోతున్నా..!

తిరుమల నుంచి సెల్ఫీ వీడియో పంపిన యువతి ● పోలీసులను ఆశ్రయించిన సోదరుడు ● గంట వ్యవధిలోనే యువతిని గుర్తించిన టూటౌన్ పోలీసులు

తిరుమల, నవంబరు29(ఆంధ్రజ్యోతి): తన భర్తతో జరిగిన గొడవ కారణంగా తాను ఆత్మహత్య చేసుకోబోతున్నానంటూ ఓ యువతి తిరుమల నుంచి తన అన్నకు వీడియో పంపింది. దీనిపై అతడు నిమిషాల వ్యవధిలో ఇక్కడి పోలీసులకు సమాచారం ఇవ్వగా.. గంట వ్యవధిలోనే ఆమెను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. తమిళనాడులోని హోసూర్‌కు చెందిన శంకర్, భావన దంపతులకు ఇద్దరు పిల్లలు. భర్తతో జరిగిన గొడవ కారణంగా గురువారం రాత్రి ఆమె ఇంటి నుంచి తిరుమలకు బయలుదేరింది. శుక్రవారం ఉదయం ఆమె శ్రీవారిమెట్టు మార్గం నుంచి 'నా భర్తతో గొడవ జరిగింది. తాను ఆత్మహత్య చేసుకోబోతున్నా' అంటూ సెల్ఫీ వీడియో రికార్డు చేసి వాట్సాప్ ద్వారా బెంగుళూరులోని తన అన్న ప్రసాద్‌కు పంపింది. ఆ తర్వాత కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు ఫోను చేసినా ఈమె నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఉదయం పదిన్నర గంటల సమయంలో కంట్రోల్ రూమ్ నుంచి తిరుమల పోలీసులను ప్రసాద్ ఆశ్రయించి, తన చెల్లిని కాపాడాలని కోరారు. వెంటనే టూటౌన్ సీఐ శ్రీరాముడు ఆధ్వర్యంలో రెండు బృందాలు ఆ సెల్ఫీ వీడియో సాయంతో భావన కదలికలపై సీసీ కెమెరాల ఫుటేజ్, సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిఘా పెట్టి.. గాలించారు. 11.30 గంటల సమయంలో తిరుమలలోని ఎస్వీ గెస్ట్ హౌస్ వద్ద భావనను గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారికి ఆమెను అప్పగించి.. ఆ యువతికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు.



యువతిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

నేడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

మంగళం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను శనివారం పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తేదీ ఆదివారం రావడంతో ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. జిల్లాలో 2,64,636 మంది లబ్ధిదారులకు గానూ రూ.112.25 కోట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఉదయం 6 గంటల నుంచే సచివాలయ ఉద్యోగులు ఇంటికి వస్తారని, అందుబాటులో ఉండి పెన్షన్ తీసుకోవాలని సూచించారు. రెండు నెలలు తీసుకోకపోయినా మూడో నెలలో ఒకేసారి మొత్తం చెల్లిస్తారని తెలిపారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పెన్షన్లు సక్రమంగా పంపిణీ చేసేలా పర్యవేక్షించాలని సూచించారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో.. ఏడుగురికి ఆరేళ్ల జైలుశిక్ష

రూ.6 లక్షల చొప్పున జరిమానా

మంగళం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డ ఏడుగురికి ఎర్రచందనం కేసుల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి ఆరేళ్ల జైలుశిక్ష, ఆరు లక్షల రూపాయల చొప్పున జరిమానా విధించినట్లు శుక్రవారం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. 2017లో కరకంబాడి బీట్ టీఎన్‌పాలెం సెక్షన్‌లో పట్టుబడిన కేసులో ఏడుగురు ముద్దాయిలకు శిక్ష పడినట్లు చెప్పారు. చిత్తూరు జిల్లాకు చెందిన అద్దంకి గంగాధరం, తుపాకుల గంగాధరం, తుపాకుల శ్రీనివాసులు, గుండ్రాళ్ల మునయ్య, పాముల నాగయ్య, టీ.బంగారయ్య, తమిళనాడుకు చెందిన కె.మురగయ్యలు ఇందులో ఉన్నారన్నారు. శేషాచల అడవుల్లోని ఎర్రచందనాన్ని నరికి అక్రమంగా తరలించే నేరస్తులకు శిక్ష తప్పదని హెచ్చరించారు.

'డ్రగ్స్ ఆరోపణలు అవాస్తవం'

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీలో డ్రగ్స్ వినియోగిస్తున్నారని వచ్చిన ఆరోపణలు అవాస్తవమని రిజిస్ట్రార్ ఆర్.జె.రమాశ్రీ పేర్కొన్నారు. అనుమానం కల్గిన ఇద్దరు విద్యార్థులకు రుయాలో వైద్య పరీక్షలు చేయించామన్నారు. వారు డ్రగ్స్ వాడలేదని రుయా నివేదిక ద్వారా స్పష్టమైందన్నారు. ఆరోపణలు వచ్చిన విద్యార్థులను తల్లిదండ్రుల చెంతకు పంపి కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నామన్నారు. విద్యార్థుల పట్ల మరింత పర్యవేక్షణ ఉంచి, క్రమశిక్షణతో సన్మార్గంలో నడిపించాలని నిర్ణయించామన్నారు.